4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 5 ఏప్రిల్ 2024
www.ntnews.com

# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

## రైతన్న గోస

**వ్యవసాయానికి** ముందుచూపు చాలా అవసరం. దూపయినప్పుడే బాయి తవ్వకుంటామంటే సాగు సాగదు. దుక్కి చేసుకోవాలి, నీళ్లు చూసుకోవాలి, విత్తనాలు, పురుగుమందులు తెచ్చిపెట్టుకోవాలి. వీటికి తోడు ప్రకృతి కూడా సహకరించాలి. ఇలా అన్నీ అదనులో అమరితేనే వ్యవసాయం సాగుతుంది. రాష్ట్రంలో ప్రస్తుతం ఈ క్రమం తప్పింది. అందుకే వ్యవసాయం ఇప్పుడు ఎవరూ లేని అనాథ అయ్యింది. అటు కేంద్రం పట్టించుకోదు, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తున్నదో, ఏం ఆలోచిస్తున్నదో తెలియదు. పాత రుణాలు మాఫీ కాలేదు. కొత్త రుణాలు రావడం లేదు. ఈలోగా బకాయిల కోసం రుణదాతలు రైతన్నల వెంబడి పడుతున్నారు. రైతుబంధు పథకం నత్తనడకన సాగుతున్నది. రోజుకో సాకుతో సర్కారు కాలం గడుపుతున్నది. ఇప్పటివరకు నాలుగైదు ఎకరాల మేర మాత్రమే నిధులు విడుదలయ్యాయి. కొత్తకొత్త కొర్రీల కారణంగా మిగతావి ఎప్పుడు పడతాయో తెలియడం లేదు. కొత్తగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసరికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇదో అదనుగా మారింది. అటుచూస్తే నీళ్ల పరిస్థితి ఆగమాగమైపోయింది. గలగలలాడిన కాలువలు, చెరువులు మూగబోయాయి. నిండు కుండల్లాంటి జలాశయాలు బోసిపోతున్నాయి. నిన్నటిదాకా గంతులు వేసిన గంగమ్మ దాగుడు మూతలాడుతున్నది. దాంతో నీటి కోసం అన్నదాతలు యాతన పడుతున్నారు. పొలాల్లో ట్యాంకర్లు, బోర్ల సందడి కనిపిస్తున్నది. చెరువులు, కాలువల పూడికతీతకు క్రేన్లు తిరుగుతున్నాయి. అటు 24 గంటల కరెంటు కూడా అందడం లేదు. రాత్రిపూట బాయిల కాడికి పరుగులు మళ్లీ మొదలయ్యాయి.

నీళ్లు లేక, కరెంటు లేక పొలాలు ఎండుతుంటే రైతుల గుండెలు మండుతున్నాయి. పండిన ఆ కాస్త పంటను మార్కెట్‌కు తీసుకుపోతే సరైన ధర రావడం లేదు. ఎప్పుడూ డిమాండ్ మీద ఉండే మిర్చికే మద్దతు ధర రావడం లేదు. పోనీ ధర వచ్చేదాకా నిల్వ చేసుకుందామంటే సౌకర్యాలు సరిపోవడం లేదు. రాష్ట్రంలో ఎటుచూసినా సమస్యలే. తీరే మార్గం కనిపించడం లేదు. వాటిని తీర్చే నాయకుడూ కాంగ్రెస్ ప్రభుత్వంలో కానరావడం లేదు. స్వరాష్ట్రం సాధించిన తర్వాత పగ్గాలు చేపట్టిన ఉద్యమ సారథి కేసీఆర్ వ్యవసాయానికే పెద్దపీట వేశారు. 'మిషన్ కాకతీయ' అనే బృహత్తరమైన పథకం కింద సుమారు 47 వేల చెరువులను పునరుద్ధరించారు. ప్రాజెక్టులు పూర్తిచేసి నీటి నిల్వకు మార్గం సుగమం చేశారు. కాళేశ్వరం వంటి భారీ ఎత్తిపోతలతో గోదావరిని ఎత్తులకు తరలించి తెలంగాణకు జలాభిషేకం చేశారు. సీజన్‌కు ముందే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచారు. రైతుబంధుతో పెట్టుబడి సాయం అందించారు. రైతు బీమాతో కుటుంబాలకు ధీమా కల్పించారు. పండిన ధాన్యం చివరి గింజ వరకు కొంటూ డబ్బు సకాలంలో ఖాతాల్లో వేయించారు.

కానీ, ఇప్పుడు రాష్ట్రంలో సాగు సడుగులిరిగాయి. మొన్నటిదాకా దర్జాగా, కాలుమీద కాలేసుకొని బతికిన రైతుల బతుకులు చిన్నాభిన్నమయ్యాయి. ఈ పరిస్థితుల్లో వ్యవసాయం గుదిబండగా మారి రైతుల ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతున్నది. పెరుగుతున్న రైతుల ఆత్మహత్యలే ఇందుకు నిదర్శనం. రైతులను ఆదుకోవాల్సిన కాంగ్రెస్ సర్కారు సాకులు వెతుకుతున్నది. ఆరునెలల కిందటి వరకు పండుగలా సాగిన వ్యవసాయం ఇప్పుడు అష్టకష్టాలపాలు కావడం విషాదం. కడుపులో పెట్టుకుని కాపాడిన కేసీఆర్ సర్కారు స్థానంలో కాళ్లల్ల కట్టెలు పెట్టే కాంగ్రెస్ ప్రభుత్వం రావడమే ప్రస్తుత దుస్థితికి కారణం అనడంలో ఏ మాత్రం సంశయం అవసరం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ కక్షలు మాని రైతాంగానికి ఉపశమనం కలిగించే దిశగా అడుగులు వేయడం శ్రేయస్కరం.

# నేతన్నలపై కక్షగట్టిన కాంగ్రెస్



**కల్వకుంట్ల తారకరామారావు**
సిరిసిల్ల శాసనసభ్యులు

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలపై కక్ష గట్టింది. కార్మికులు రోడ్డున పడుతున్నా కనికరించడం లేదు. వాళ్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదు. తత్ఫలితంగా పదేండ్ల తర్వాత రాష్ట్రంలో ఉమ్మడి ఏపీ నాటి సంక్షోభం తలెత్తింది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వం వలె నేతన్నలకు చేతినిండా పనివ్వాలి. వస్త్ర పరిశ్రమను ఆదుకోకపోతే కాంగ్రెస్ సర్కార్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖ పూర్తి పాఠం...



**గౌరవనీయులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారికి...**

బీఆర్ఎస్ పాలనలో పదేండ్లు పండుగలా కళకళలాడిన చేనేత రంగం మీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మళ్లీ సంక్షోభంలోకి కూరుకుపోయింది. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందో, మళ్లీ కాంగ్రెస్ వచ్చి నాలుగు నెలలు గడవకముందే అదే విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్నది. మీ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరి వల్ల గత నాలుగు నెలలుగా నేతన్నలు చేనేత పనులకు దూరం కావడమే కాదు, పవర్‌లూమ్స్ పూర్తిగా బంద్ అయ్యాయి. చేనేత కార్మికులు, పవర్‌లూమ్ ఆసాములతో పాటు కార్మికులు రోడ్డునపడటంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, ముందుచూపు లేకపోవడం వల్ల వేలాది మంది నేతన్నలు, పవర్‌లూమ్ కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో వారి జీవితాలు దుర్భరంగా మారుతున్నా మీ ప్రభుత్వానికి కనీసం కనికరం లేదు. తమకు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మిక లోకం నిత్యం దీక్షలు, ధర్నాలు, నిరసనల రూపంలో ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తున్నప్పటికీ మీ ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం లేకపోవడం అత్యంత దారుణమైన విషయం. ఆదుకోవాల్సిన అధికార పార్టీ నేతలే కార్మికులను అవమానించేలా మాట్లాడటం.. వారి మనోస్థైర్యాన్ని మరింత దెబ్బతీస్తున్నది. ఇటీవల కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రతి కార్మికుని గుండెను గాయపరిచాయి. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తడక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఉరి వేసుకుని తనువు చాలించాడు. ఇది ఆత్మహత్య కాదు, ముమ్మాటికీ మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యగానే నేతన్నలు భావిస్తున్నారు. నేతన్నలపై కాంగ్రెస్‌కున్న చిన్నచూపు ఈ వ్యాఖ్యల ద్వారా స్పష్టంగా అర్థమవుతున్నది.

కొత్తగా ప్రభుత్వంలోకి వచ్చిన మీకు ఒక్కసారి గతం గురించి వివరించే ప్రయత్నం చేస్తున్నాను. సరిగ్గా ఇవే పరిస్థితులు సమైక్య రాష్ట్రంలో నెలకొని ఉండేవి. తెలంగాణ సాధించాక పాలనా పగ్గాలు చేపట్టిన కేసీఆర్ తెలంగాణలో నేతన్నలను, వస్త్ర పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యాన్ని ఇచ్చి, సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. చిక్కి శల్యమైన ఈ పరిశ్రమను ఆదుకోవడానికి స్వయంగా వస్త్ర పరిశ్రమ పెద్దలను పిలిపించి.. ఒక రోజంతా అధికారులతో కలిసి అప్పటి సీఎం కేసీఆర్ గారు సమీక్ష నిర్వహించారు. నేతన్నల వేతనాలు, కూలీ రెట్టింపయ్యేలా, ప్రతి కార్మికుడు నెలకు రూ.15 వేలు నుంచి రూ.20 వేలు సంపాదించుకొని గౌరవప్రదంగా జీవించేందుకు పటిష్ఠమైన కార్యాచరణను రూపొందించారు. అనేక వినూత్నమైన సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చారు. చేనేత మిత్ర, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలు ప్రారంభించారు. వీటి కోసం భారీ ఎత్తున గత 60 ఏండ్లలో ఎప్పుడు లేనంతగా బడ్జెట్‌లో నిధులను కేటాయించారు.

గతంలో ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా అయ్యే, రాజీవ్ విద్యా మిషన్, సర్వశిక్ష అభియాన్ కార్యక్రమాల ఆర్డర్లను రాష్ట్రంలోని నేతన్నలకు ఇచ్చి, చేతి నిండా పని కల్పించింది నాటి ప్రభుత్వం. దీంతో అప్పటిదాకా ఉపాధి లేక అల్లాడిన కార్మికులకు పని లభించింది. సంప్రదాయంగా వస్తున్న వృత్తిని కొనసాగిస్తూనే పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా వారిని తీర్చిదిద్దేందుకు కూడా ప్రభుత్వం తోడ్పాటునందించింది. మగ్గాల ఆధునికీకరణ, రుణాల మాఫీ, మార్కెట్‌తో అనుసంధానం వంటి ఆల్‌రౌండ్ అప్రోచ్‌తో ముందుకుసాగింది. వీటన్నింటి వల్ల కార్మికులకు ఊరట లభించింది. వారికి మరింత పని కల్పించడంతో పాటు, కడుపునిండా అన్నం పెట్టేలా బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా బతుకమ్మ చీరల పథకం ప్రారంభించి, అమలు చేసింది. బతుకమ్మ చీరల ఆర్డర్లు కూడా అందించడంతో.. కార్మికులకు చేతినిండా పని దొరికింది. దీంతోపాటు.. రంజాన్, క్రిస్మస్ కానుకల్లో ఇచ్చే వస్త్రాల ఆర్డర్లు కూడా వారికి ఇవ్వడంతో కార్మికులకు మరింతగా ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఇలా ఏడాదికి దాదాపు ఎనిమిది నెలల వరకూ వరుస ఆర్డర్లు అందడంతో.. సాంచాల పరిశ్రమలో సంతోషం వెల్లివిరిసింది. పవర్‌లూమ్‌లను ఆధునీకరించుకునేందుకు సబ్సిడీపై రుణాలు కూడా ఇవ్వడంతో వస్త్ర పరిశ్రమపై ఆధారపడినవారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపినట్టయింది.

నేత రంగానికి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా సాగిన ఆ మహాయజ్ఞం ఎన్నో గొప్ప ఫలితాలను ఇచ్చింది. తెలంగాణలో వస్త్ర పరిశ్రమ విస్తరించి ఉన్న వివిధ ప్రాంతాలతో పాటు.. కాంగ్రెస్‌తో సహా గత ప్రభుత్వాల పాలనలో ఒకప్పుడు ఉరిశాలగా మారిపోయిన సిరిసిల్ల కొత్త కాంతులతో వెలుగులీనింది. వీటికితోడు నేతన్నకు బీమా అమలు చేయడంతో కార్మికుల కుటుంబాలకు ధీమా లభించింది. వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో కార్మికలోకం కొనుగోలు శక్తి కూడా పెరిగింది. ఓ వైపు కార్మికుల సంక్షేమం, మరోవైపు సమగ్ర అభివృద్ధితో వారి జీవితాల్లో గుణాత్మక మార్పు వచ్చింది. పవర్‌లూమ్ కార్మికులు అధికంగా ఉండే కరీంనగర్, సిరిసిల్లతో పాటు.. వరంగల్, ఇతర ప్రాంతాల్లోని కార్మికులకు కూడా బీఆర్ఎస్ హయాంలో రూ.కోట్ల విలువైన ఆర్డర్లు ఇవ్వడంతో.. వస్త్ర పరిశ్రమకున్న అన్ని సమస్యలు తొలగిపోయాయి.

తెలంగాణ సాధించిన క్షణం నుంచి పదేండ్ల పాటు పండుగలా మారిన వస్త్ర పరిశ్రమ చుట్టూ.. కాంగ్రెస్ సర్కార్ రాగానే మళ్లీ చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. పరిశ్రమను దెబ్బతీయడంతో పాటు కార్మికుల జీవితాలతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తున్న మీ కాంగ్రెస్ సర్కారు వెంటనే తన తీరు మార్చుకోవాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన కార్యక్రమాలను భేషజాలకు వెళ్లకుండా కొనసాగించాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏటా బతుకమ్మ చీరల ఆర్డర్లకు సంబంధించి జీవోను ఫిబ్రవరి మాసంలోనే విడుదల చేసేది. కానీ, ఏప్రిల్ నెల మొదలైనా కాంగ్రెస్ సర్కారు వైపు నుంచి కదలిక లేకపోవడంతో వీటిపై ఆధారపడిన వారందరిలో ఆందోళన రోజురోజుకూ పెరిగిపోతున్నది. ఇది 35 వేల మంది కార్మికులు, వారి కుటుంబాలకు సంబంధించిన కీలకమైన సమస్య కాబట్టి వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. వెంటనే నేతన్నలకు బతుకమ్మ చీరల ఆర్డర్లు అందించి వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలి. అలాగే యార్న్ సబ్సిడీని కూడా వెంటనే విడుదల చేయాలి. మా ప్రభుత్వం ఉన్నప్పుడు నెలనెలా కార్మికుల ఖాతాల్లో నేరుగా సుమారు రూ.3000 వరకు పడేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక చేనేత మిత్ర కార్యక్రమం ఆగిపోయింది. మూలన పడిన సాంచాలను తిరిగి తెరిపించడానికి.. పరిశ్రమకు రావాల్సిన రూ.270 కోట్లు బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. మరోవైపు సొంత రాష్ట్రంలోని కార్మికులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ పెద్దలు కమీషన్లకు కక్కుర్తిపడి.. తమిళనాడుకు, సూరత్‌కు ఆర్డర్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తున్నది.

రైతాంగ సంక్షోభాన్ని చూసినట్టు నేతన్నల సంక్షోభాన్ని కూడా రాజకీయ కోణంలో కాకుండా.. పేద, బడుగు, బలహీనవర్గాలైన నేతన్నల కోణంలో ఆలోచించి వెంటనే పరిష్కరించాలని రాష్ట్రంలోని నేత కార్మికుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఇప్పటికే పులువురు కార్మికులు ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. వస్త్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనాలి. ప్రస్తుతం అందుతున్న అన్ని కార్యక్రమాలను కొనసాగించాలి. అవసరమైతే మరింత అదనపు సాయమందేలా చూడాలి కానీ, కేవలం గత ప్రభుత్వంపై దుగ్ధతో వేల మంది నేతన్నల పొట్ట కొట్టవద్దని కోరుతున్నాను. లేకపోతే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఈ పరిశ్రమపై ఆధారపడిన వేల మంది చేనేత కార్మికులు, వారి కుటుంబసభ్యులు మరింత సంక్షోభంలో కూరుకుపోతారని ఆవేదనతో తెలియజేస్తున్నా. ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై వేగంగా స్పందించి, నేతన్నలను ఆదుకోవాలని ప్రధాన ప్రతిపక్షంగా, మా పార్టీ తరపున కోరుతున్నాను. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రంలోని నేతన్నలు తమ పొట్టకొడుతున్న కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ క్షమించరు.

**జై నేతన్న, జై తెలంగాణ, జై బీఆర్ఎస్!**

కేంద్ర ప్రభుత్వం 370 అధికరణం రద్దు చేసిన తర్వాత జమ్మూకశ్మీర్ నుంచి లడఖ్‌ను విడగొట్టింది. కొండకోనల్లో ఉండే ఈ చిన్న భూభాగానికి కేంద్రం ఆ సందర్భంగా ఎన్నో హామీలిచ్చింది. కానీ, అవేవీ తీర్చకుండా నిర్లక్ష్యం చేస్తుండటంతో లధఖ్‌లో అంతకంతకూ అసమ్మతి పెరుగుతూ వస్తున్నది. ఈ అసమ్మతి క్రమంగా పోరాట రూపం సంతరించుకున్నది. లడఖ్ రాజ్యాంగ హక్కుల కోసం, విశిష్ట పర్యావరణ, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అక్కడి ప్రజలు ఉద్యమం చేస్తున్నారు. ఈ ఉద్యమానికి ప్రతీకలా నిలుస్తున్న వారు సోనమ్ వాంగ్‌చుక్. 21 రోజుల నిరశన దీక్షతో ఇటీవల దేశమంతటా వార్తల్లో నిలిచారాయన.

# లడఖ్ జలదాత.. ఉద్యమ పొలికేక



**కోట దామోదర్**
93914 80475



లడఖ్ ప్రాంతానికి రాష్ట్ర హోదా కల్పించాలని, రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్లతో మార్చి 6 నుంచి అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష కొనసాగింది. దీక్ష విరమణ తర్వాత రిలే దీక్షలు కొనసాగుతాయని వాంగ్‌చుక్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా లడఖ్ ఉద్యమానికి మద్దతు కూడా పెరుగుతున్నది. లడఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించడం, గిరిజన తెగలను రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా స్థానిక స్వపరిపాలన అవకాశం కల్పించడం, స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలన్నది ఆయన డిమాండ్లలో ప్రధానాంశాలు. పర్యావరణం కోసం కూడా ఆయన పోరాడుతున్నారు. ఇంతకూ ఎవరీ వాంగ్‌చుక్? ఈయన వృత్తి రాజకీయం కాదు. వాంగ్ ఇంజినీరింగ్‌లో దిట్ట. సంప్రదాయేతర విద్యావిధాన రూపకర్తగా ఆయన పేరుపొందారు. ముఖ్యంగా లడఖ్ నీటి సమస్యను పరిష్కరించిన ప్రయోగశీలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. లెక్కలేనన్ని ఆవిష్కరణలకు ఆద్యుడిగా నిలిచారు. తాను చేసిన కృషికి గుర్తింపుగా అనేక అవార్డులు అందుకున్నారు. 2018లో రామన్ మెగసెసె అవార్డు పొందడం విశేషం. ఐసీఏ పురస్కారం, సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది ఇయర్, రోలెక్స్ అవార్డ్, ఇంటర్నేషనల్ టెర్రా అవార్డుతో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు ఆయనను వరించాయి. ఈ నేపథ్యంలో వాంగ్ పోరాట పటిమను తెలియజెప్పే ప్రయత్నమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం.

భారత్‌లోనే అత్యంత అందమైన ప్రదేశం లడఖ్. అద్భుతమైన, సహజమైన ప్రకృతి అందాలకు, ప్రత్యేకమైన సాంస్కృతిక వారసత్వానికి ప్రసిద్ధి చెందింది ఈ ప్రాంతం. హిమానీనదాలు కరిగినప్పుడు వచ్చే నీరే తాగు నీటికి, సాగు నీటికి ఆధారం. ఈ ప్రాంతం అధిక ఎత్తులో ఉన్నందున, వాతావరణ మార్పుల కారణంగా హిమానీనదాల నీరు దిగువ ప్రాంతానికి ప్రవహిస్తుంది. కాబట్టి, లడఖ్‌లో ఏప్రిల్-మే నెలల్లో తీవ్రమైన నీటిఎద్దడి ఉంటుంది. ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎన్ని ప్రయోగాలు చేసినా ఫలితం లేకపోయింది. నీటి సమస్య తీవ్రరూపం దాల్చడంతో అక్కడి ప్రజలు వలసబాట పట్టేవారు.

మెకానికల్ ఇంజినీర్ అయిన సోనమ్ వాంగ్‌చుక్ ఒక రోజు వంతెన కింద నడుచుకుంటూ వెళ్తుండగా, వంతెన కిందిభాగం మంచుతో కప్పి ఉండటాన్ని గమనించారు. వాతావరణం కారణంగా చుట్టుపక్కల మంచు కరిగిపోయినా వంతెన కింది భాగం కరగలేదు. వంతెన కింది భాగంలో మంచు ఎందుకు కరగడం లేదో తెలుసుకోవడానికి ఆయన అనేక ప్రయోగాలు చేసిన తర్వాత సూర్య కాంతి లేనందున మంచు కరగలేదనే విషయాన్ని తెలుసుకున్నారు. మంచును సూర్యుడి నుంచి నీడగా ఉంచగలిగితే హిమం ఎక్కువకాలం ఉంటుందని వాంగ్ చుక్ ఈ సందర్భంగా గ్రహించారు.

> నీటి సమస్యను ఎదుర్కోవడానికి వాంగ్ చుక్‌కి వచ్చిన సరికొత్త ఆలోచనే 'మంచు స్థూపం'. ఈ ఆలోచనను అమలు చేసి 2014 ఫిబ్రవరిలో దాదాపు 1,50,000 లీటర్ల శీతాకాలపు నీటి ప్రవాహాన్ని నిల్వ చేయగల మంచుస్థూపాన్ని ఆయన నిర్మించారు. ఆ తర్వాత క్రమక్రమంగా మంచు స్థూపాల సంఖ్య పెరిగాయి. ప్రస్తుతం 27 మంచు స్థూపాలు ఉన్నాయి. అలా ఏర్పాటు చేసిన ప్రతి మంచుస్థూపం నుంచి రోజుకు 5,000 లీటర్ల నీటి లభ్యత ఉండటం ఆయన ప్రతిభకు నిదర్శనం. వాంగ్‌చుక్ కృషి ఫలితంగానే లడఖ్ ప్రాంత నీటి సమస్యకు పరిష్కారం లభించిందనడంలో ఎలాంటి సందేహం లేదు.

లడఖ్ గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆయన 1988లో స్టూడెంట్స్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ మూవ్‌మెంట్ ఆఫ్ లడఖ్ (సెక్మోల్)ని స్థాపించారు. ఆ సంస్థ నేతృత్వంలో పలు విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు. వాంగ్‌చుక్ విద్యా విధానం విప్లవాత్మకమైనది. ఆచరణాత్మక, పర్యావరణ అనుకూల విద్యను బోధించడమే దాని ప్రత్యేకత. పదో తరగతి పరీక్షల్లో ఫెయిలైన, ఉత్తీర్ణత సాధించినప్పటికీ నైపుణ్యాలు లేని లడఖ్ యువతకు సంప్రదాయేతర విద్యావకాశాలను అందించడం ఈ సంస్థ ప్రత్యేకత. ఈ బడుల్లో మాతృభాష లడఖీలోనే విద్యాబోధన జరుగుతుంది. అలాగే దివ్యాంగులు, అనాథలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. పేద విద్యార్థులకు స్పాన్సర్‌షిప్‌లు కూడా ఇప్పిస్తారు. విద్యార్థులకు ప్రాక్టికల్ సైన్స్, సామాజిక సమస్యల నుంచి పబ్లిక్ స్పీకింగ్, గార్డెనింగ్, జంతువులు, చెట్ల సంరక్షణ, లడఖీ పాటలు, నృత్యం, సాంస్కృతిక విద్య లాంటి విభిన్న అంశాల్లో శిక్షణ ఇస్తారు. మూసధోరణి కాకుండా విద్యార్థుల్లో ఆచరణాత్మక, సామాజిక, వృత్తి నైపుణ్యాలను పెంపొందిస్తారు. లడఖ్ ప్రాంత విద్యాభివృద్ధికి సోనమ్ చేసిన సేవలకు ప్రశంసలు దక్కాయి.

2021లో వాంగ్‌చుక్ లడఖ్ ప్రాంతంలోని సియాచిన్, గల్వాన్ లోయ వంటి అత్యంత శీతల ప్రదేశాల్లో ఆర్మీ సిబ్బంది ఉపయోగించగల పర్యావరణ అనుకూలమైన సోలార్ హీటెడ్ టెంట్‌ను రూపొందించారు. భీకరమైన శీతల గాలులను ఎదుర్కొనేందుకు మట్టితో తయారు చేసిన చవకైన సౌర ఉష్ణ భవనాలను రూపొందించడంలో కూడా కీలకపాత్ర పోషించారు. వాంగ్ చుక్ వ్యక్తిత్వం 2009లో వచ్చిన '3 ఇడియట్స్' చిత్రంలోని కాల్పనిక పాత్ర పున్సుఖ్ వాంగ్డుకు స్ఫూర్తినిచ్చిందని అంటారు.

# వృద్ధ నేతల కుప్పిగంతులు

రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగి.. రాష్ట్రంలో, దేశంలో తమకంటూ ఒక గుర్తింపును, గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించుకున్న నాయకులు చివరికి కుమారుల కోసమో.. కూతుళ్ల కోసమో తమ రాజకీయ జీవితాలను పణంగా పెట్టి మౌనంగా రిటైర్ అవ్వాల్సిన పరిస్థితులు కొని తెచ్చుకుంటున్నారు. అటువంటి నేతల కారణంగా రాజకీయాల్లో అధికారమే తప్ప విలువలకు స్థానం ఉండదని పదేపదే నిరూపితమవుతున్నది.



**కోవెల సంతోష్ కుమార్**





భారతదేశ రాజకీయం విలువల వలువలు ఎప్పుడో విప్పేసింది. రాజకీయాల్లో ప్రవేశించిన నాటి నుంచి జీవితాంతం తనకంటూ ఒక సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసి.. చివరి నిమిషంలో కొడుకు కోసమో.. కూతురు కోసమో పార్టీ మారడంతో అంతకాలం నిర్మించుకున్న ప్రతిష్ఠ ఒక్కసారిగా మసకబారుతుంది. కడియం శ్రీహరి, కే కేశవరావులు దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నవారే. కే కేశవరావుకు 84 ఏండ్లు కాగా.. కడియం శ్రీహరికి 71 ఏండ్లు వచ్చాయి. కేశవరావుది కాంగ్రెస్‌లో సుదీర్ఘమైన రాజకీయ జీవితం. జాతీయస్థాయిలో పార్టీ కోసం అనేక బాధ్యతలను విజయవంతంగా నిర్వహించిన నాయకుడాయన. తెలంగాణ ఉద్యమం విజయవంతమై ఫలితాన్నిస్తున్న తరుణంలో టీఆర్ఎస్ పార్టీలో చేరిన కేశవరావు అక్కడ కూడా సముచిత స్థానాన్నే పొందారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆయనను నెత్తిన పెట్టుకున్నారు. తన తర్వాతి స్థానాన్ని అప్పజెప్పారు. ఎన్ఆర్ఐగా ఉన్న కేకే కుమార్తె గద్వాల విజయలక్ష్మిని జీహెచ్ఎంసీ మేయర్‌ను చేశారు. కానీ, ఇప్పుడు 84 ఏండ్ల వయసులో కేశవరావు తన కూతురు కోసం తన రాజకీయ జీవితానికి తానుగా ముగింపు పలికారు. ఆయన బయటకువచ్చి కేసీఆర్‌ను ఏమీ అనలేరు.. అలాగని కూతురు నిర్ణయాన్ని కాదని ఉండలేరు. ఇక తప్పక ఏవో సమర్థింపు మాటలు చెప్పుకొంటూ పార్టీ మారారు.

కడియం శ్రీహరిది కూడా అదే పరిస్థితి. టీడీపీలో అత్యంత వేగంగా ఎదిగిన వ్యక్తి కడియం శ్రీహరి. 1994లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన మార్కెటింగ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 1995లో ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడవటానికి ప్రధానమైన ఉపకరణంగా కూడా ఆదిలాబాద్ నాయకుడు నగేశ్‌తో పాటు, కడియం శ్రీహరి చంద్రబాబుకు బాగా ఉపయోగపడ్డారు. శ్రీహరి, నగేశ్‌లను ఎన్టీఆర్ సస్పెండ్ చేయడాన్ని కారణంగా చూపించే.. ఆనాడు ఎన్టీఆర్‌పై చంద్రబాబు డ్రామాకు తెరలేపారు. తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్‌లో చేరిన కడియం శ్రీహరికి తొలి క్యాబినెట్‌లో ఉప ముఖ్యమంత్రి పదవి లభించింది. ఆ తర్వాత ఎమ్మెల్సీ అయ్యారు. గత ఐదేండ్ల నుంచి తన కూతురు కావ్యను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకురావడం కోసం ఆయన పక్కా వ్యూహంతో ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ వ్యూహంలో భాగంగానే లెక్కలు వేసుకొని మరీ ఆమెతో ఒక సామాజిక సేవా ట్రస్ట్‌ను ప్రారంభింపజేసి.. ప్రజలకు సేవలు చేయించారు. సామాజిక దృక్కోణంలో ఆమె పేరుతో వ్యాసాలూ అచ్చయ్యాయి. టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా కడియంకు ఉన్నత స్థానం కల్పించారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి కడియం కూతురు కావ్యకు టిక్కెట్ కూడా ప్రకటించారు. కానీ, శ్రీహరి తానుగా ఒక సర్వే చేయించుకున్నారట. అందులో ఆయన కూతురు ఓడిపోతుందని వచ్చిందట. దీంతో తొలి ఎన్నికల్లోనే ఓటమి పాలైతే కష్టమని, అధికార పార్టీ నుంచి పోటీ చేస్తే గెలువచ్చునేమో అన్న భ్రమతో.. భయపడి హడావుడిగా ఆయన కాంగ్రెస్‌లో చేరిపోయారు.

> కాంగ్రెస్ కురువృద్ధ నాయకుడు డి.శ్రీనివాస్ రాజకీయ పరిస్థితీ ఇదేవిధంగా ముగిసిపోయింది. రెండుసార్లు తన హయాంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చిన డి.శ్రీనివాస్.. 2018 ఎన్నికల్లో తన కొడుకు అరవింద్ కోసం బీఆర్ఎస్ పార్టీకి దూరమైపోయారు. పార్టీలో ఉండి కూడా.. తన క్యాడర్‌తో బీజేపీకి ఓటు వేయించడం ద్వారా కేసీఆర్ కూతురు కవిత ఓటమికి కారణమయ్యారు.

ఆ తర్వాత మొన్నటికి మొన్న మరో కొడుకు సంజయ్ కోసం కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. రాజకీయం అన్నది ఫక్తు వ్యాపారంగా మారిన ఈ రోజుల్లో.. తమ తర్వాత తమ వారసులను అదే వృత్తిలో కొనసాగించేందుకు నాయకులు దేనికైనా సిద్ధపడుతున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో దేశం మొత్తం మీద ఈ ధోరణి మనకు స్పష్టంగానే కనిపిస్తున్నది. 60, 65 ఏండ్లు పైబడిన నాయకులు తమ వారసులకు బెర్తులు సిద్ధం చేస్తున్నారు. కానీ, రాజకీయాల్లో వారసత్వం అన్నది కేవలం ఎంట్రీ టిక్కెట్ లాంటిదే. ఒక్కసారి ఎంట్రీ ఇచ్చాక పర్ఫార్మెన్స్ బాగా లేకపోతే.. ఎంతటివారికైనా అధోగతే. ఈ విషయాన్ని తండ్రులు గ్రహిస్తే.. తమ రాజకీయ జీవితాలను ఇలా పణంగా పెట్టాల్సిన పరిస్థితి ఉత్పన్నం కాదు.

**మళ్లీ అవకాశం ఇవ్వవద్దు!**

*బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం. ఒకవేళ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే.. ప్రజాస్వామ్య సూత్రాలకు మన దేశం పూర్తిగా దూరమవుతుంది. అందుకే బీజేపీకి, మోదీకి మరోసారి అవకాశం ఇవ్వవద్దు.*

**- కమల్ హాసన్,** ఎంఎన్ఎం అధ్యక్షుడు